## గ్రేటర్ @40.6 డిగ్రీలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 6(నమస్తే తెలంగాణ): దక్షిణ దిశ నుంచి తెలంగాణ రాష్ట్రం వైపునకు వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడం, గాలిలో తేమ శాతం పడిపోవడం వల్ల రాగల రోజుల్లో గ్రేటర్‌లో వడ గాలులు వీచే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు ఎల్లో హెచ్చరికలు జారీచేశారు. కిందిస్థాయి గాలుల ప్రభావంతో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 40.6 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 26.2 డిగ్రీలు, గాలిలో తేమ 22 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

## 15 నుంచి సెల్ట్‌లో ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 6: ఓయూలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ఈ నెల 15వ తేదీ నుంచి పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వేర్వేరుగా ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సు తరగతులను ప్రారంభించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ తెలిపారు. 8, 9, 10వ తరగతులు, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు వేసవికాలంలో వేర్వేరుగా ఒక నెలరోజుల సర్టిఫికెట్ కోర్సును సెల్ట్‌లో నిర్వహిస్తారు. ఉదయం ఆరున్నర గంటల నుంచి ఎనిమిది గంటల వరకు, పాఠశాల విద్యార్థులకు ఉ॥ 8.15 గం॥ నుంచి 9.45 గం॥ల వరకు బ్యాచ్‌లను నిర్వహించనున్నారు. అభ్యర్థులు 14వ తేదీలోగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నం: 7989903001లో సంప్రదించాలి.

# మసకబారుతున్న ఓయూ ప్రభ



**తెరుచుకోని ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి వెబ్‌సైట్**

**మూడు రోజులుగా విద్యార్థులకు ఇబ్బందులు**

**తప్పుల తడకగా మారిన ఓయూ ప్రధాన వెబ్‌సైట్**

**పట్టించుకోని అధికార యంత్రాంగం**

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 6: ప్రభుత్వ, అధికార యంత్రాంగ విరుద్ధమైన పోకడలు, వింతైన పాలనా తీరుతో ఉస్మానియా యూనివర్సిటీ ఔన్నత్యానికి చెద పట్టేలా ఉన్నది. ప్రతిష్ఠాత్మక ఉస్మానియా యూనివర్సిటీ ప్రభ అధికారుల నిర్లక్ష్యంతో క్రమేణా మసకబారుతోంది. అధికారుల నిర్ణయాలు ఇప్పటికే కొన్ని వివాదాస్పదమవడంతో పాటు విద్యార్థుల ఆందోళనలతో వార్తల్లోకెక్కాయి. తాజాగా రెండు రోజుల నుంచి ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి వెబ్‌సైట్ http://ouexams.in పనిచేయడం లేదు. 'దిస్ డొమైన్ నేమ్ ఎక్స్‌పైర్డ్'అనే సందేశం కనిపిస్తోంది. రెండు రోజులు గడిచినా పట్టించుకునే నాథుడు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాలని విద్యార్థులు కోరుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫోన్ లైన్‌లో అందుబాటులోకి రాలేదు.

### నిలిచిపోయిన పలు రకాల సేవలు

అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతికత నేపథ్యంలో కీలకమైన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచికి సంబంధించిన అన్ని సేవలు వెబ్‌సైట్ ఆధారంగానే కొనసాగుతున్నాయి. సాధారణంగా విద్యార్థులకు ఎటువంటి సర్టిఫికెట్లు అవసరమైనా వెబ్‌సైట్ ద్వారానే నియమిత రుసుము చెల్లించడంతో పాటు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వెబ్‌సైట్ తెరుచుకోకపోవడంతో ఈ సేవలన్నీ నిలిచిపోయాయి. పరీక్షా ఫీజుల స్వీకరణ, గడువుల పొడగింపు, పరీక్షా తేదీల ఖరారు, పరీక్షా ఫలితాల విడుదల తదితర అన్ని అంశాల నోటిఫికేషన్లు సైతం ఆ వెబ్‌సైట్‌లోనే అందుబాటులో ఉంటాయి. దీంతో విద్యార్థులు పరీక్షలకు సంబంధించిన ఎటువంటి సమాచారం లేకపోవడంతో తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.

### పదవీ విరమణ చేసి ఏండ్లు గడిచినా...

ఉస్మానియా యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్ www.osmania.ac.in సైతం తప్పుల తడకగా మారిపోయింది. అధికారుల నిర్లక్ష్య వైఖరితో వెబ్‌సైట్‌ను సందర్శించే వాళ్లు ముక్కున వేలేసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. వర్సిటీకి సంబంధించిన సమస్త సమాచారం, జరుగనున్న సదస్సులు, ఇతర నోటిఫికేషన్లు తదితర అన్ని వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచాల్సిన అధికారులు అది తమ పనే కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. వర్సిటీలో వివిధ పరిపాలనాపరమైన పదవుల్లో కొత్తవారు విధుల్లో చేరినప్పటికీ, వెబ్‌సైట్‌లో మాత్రం పాత వారి పేర్లే దర్శనమిస్తున్నాయి. కొంత మంది ప్రొఫెసర్లు పదవీ విరమణ చేసి కొన్నేండ్లు గడుస్తున్నా ఇంకా పదవుల్లో కొనసాగుతున్నట్లే వెబ్‌సైట్‌లో చూపించడం గమనార్హం.

# గాంధీలో డయాలసిస్ హబ్

## కమాండ్ కంట్రోల్ కేంద్రమూ ప్రారంభం

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 6: కిడ్నీ సమస్యలతో ఉన్న బాధితులకు డయాలసిస్ చేస్తున్న ఉత్తర తెలంగాణాలోని 22 కేంద్రాలతో అనుసంధానం చేస్తూ, గాంధీ దవాఖానలోని నెఫ్రాలజీ విభాగంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక హబ్, స్పోక్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని శనివారం గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు ప్రారంభించారు. అనంతరం, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీహరి, నెఫ్రాలజీ విభాగం హెచ్ఓడీ, ప్రొఫెసర్ ఎడ్ల మంజుషతో కలిసి వివిధ జిల్లాలలోని డయాలసిస్ కేంద్రాల ఇన్‌చార్జిలు, రోగులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కిడ్నీ సమస్యలతో ఉన్న రోగుల ఆరోగ్య స్థితిగతులను నిరంతరం సమీక్షిస్తూ ఉండాలని, సకాలంలో వారికి వైద్యం అందించాలని, పరిస్థితి క్షీణిస్తే వారిని గాంధీ దవాఖానకు సిఫారసు చేయాలని ఆయన అన్నారు. రోగులను డయాలసిస్ చేశాక ఆరోగ్యం ఎలా ఉంది? మందులను వాడుతున్నారా? ఇతర సమస్యలు ఏవైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన ఈ కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా 24 గంటల పాటు పర్యవేక్షణ ఉంటుందని, ప్రతిరోజు డయాలసిస్ కేంద్రాల ఇన్‌చార్జిలు, ఆయా దవాఖానాల సూపరింటెండెంట్లు మాట్లాడవచ్చని డాక్టర్ రాజారావు అన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న డయాలసిస్ కేంద్రాల నుంచి గాంధీ దవాఖానలో ఉన్న హబ్‌కి లింక్ చేశామని, వారు అక్కడి నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిపుణులైన వైద్యులతో సలహాలను, సూచనలను పొందవచ్చని తెలిపారు. అవసరమైన వారికి జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా గాంధీ దవాఖానలో కిడ్నీ మార్పిడి కూడా చేస్తున్నామని ఆయన అన్నారు.

### గాంధీ దవాఖాన హబ్ నుంచి అనుసంధానమైన డయాలసిస్ కేంద్రాలివే..

కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జనగామ, ఇల్లందు, ఖమ్మం, కోరుట్ల, వేములవాడ, గోదావరిఖని, హుజూరాబాద్, ధర్మపురి, జగిత్యాల, మణుగూరు, మహదేవ్‌పూర్, జాఫర్‌గఢ్, భద్రాచలం, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట్, నర్సంపేట్, మహబూబాబాద్ డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి.



*గాంధీ దవాఖానలో డయాలసిస్ హబ్, కమాండ్ కంట్రోల్ కేంద్రం ప్రారంభించిన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు*



## తైక్వాండో కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ తైక్వాండో అసోసియేసన్ కొత్త కార్యవర్గం కొలువుదీరింది. నాచారంలో శనివారం జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశం(ఏజీఎమ్)లో రానున్న నాలుగేండ్ల కాలానికి ఎన్నిక నిర్వహించారు. జాతీయ తైక్వాండో అసోసియేషన్ నుంచి సుబ్బారావు పర్యవేక్షకుడిగా హాజరయ్యారు. అధ్యక్షుడిగా మాల్క కొమురయ్య, చైర్మన్‌గా శ్రీధర్, ఉపాధ్యక్షులుగా కృష్ణ, విజయ సోమ, ప్రధాన కార్యదర్శిగా వహజ్ అలీఖాన్, సంయుక్త కార్యదర్శిగా సుబ్రమణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక**




*ఎన్నికల నిర్వహణపై మాట్లాడుతున్న రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు*

సిటీబ్యూరో, ఏప్రిల్ 6(నమస్తే తెలంగాణ): చేవెళ్ల పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ఎన్నికల అధికారులు పనిచేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక సూచించారు. శేరి లింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంటు నియోజవర్గ ఎన్నికల నిర్వహణపై వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, శేరి లింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహలతో కలిసి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శశాంక మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని, రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా నిర్వహించాలని ఏఆర్‌ఓలను, నోడల్ అధికారులను ఆదేశించారు. చేవెళ్ల పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 29,19,465 ఓటర్లున్నారని, 2,824 పోలింగ్ కేంద్రాలు, 53 సహాయక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించిన విధంగానే ప్రశాంతంగా నిర్వహించాలని, ఫామ్ నం.7, 8లను పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కరించారని అధికారులకు సూచించారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణలో పోలింగ్ నిబంధనలు, మాక్ పోల్ నిర్వహించే విధానం, పోలింగ్ రోజు నిర్వర్తించవలసిన విధులపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించాలని ఏఆర్‌ఓలను ఆదేశించారు. పీఓలు, ఓపీఓలు, పోలీస్ సిబ్బంది అందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

### ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

**స్వీప్ నోడల్ అధికారి అరుణ కుమారి**

సిటీబ్యూరో, ఏప్రిల్ 6(నమస్తే తెలంగాణ): ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసేలా అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటు వేయాలని స్వీప్ నోడల్ అధికారి అరుణ కుమారి పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో శనివారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. జీవీకే షాపింగ్ మాల్స్‌లో 'ఐ ఓట్ ఫర్ షూర్' అనే ప్లకార్డులను ప్రదర్శించారు. అదే విధంగా ఓటర్ జాబితాలో తమ పేరును చెక్ చేసుకోవాలని, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. కొత్త ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం కల్పిస్తున్న అవకాశాన్ని యువత వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వీప్ అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ ఆశ, జూబ్లీహిల్స్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్, ఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరా

**సమీక్షా సమావేశంలో జిల్లా ప్రత్యేక అధికారి విజయేంద్ర**




*సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి విజయేంద్ర, పక్కన జిల్లా కలెక్టర్ గౌతమ్*

మేడ్చల్, ఏప్రిల్ 6(నమస్తే తెలంగాణ): తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన రాష్ట్ర రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి, విజయేంద్ర అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సమావేశపు హాల్‌లో జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో కలిసి తాగునీటి సరఫరాపై మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితులలో తాగునీటి సరఫరా అంశం అత్యంత కీలకమైందని, దీనిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా తీరును ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారాలపై ఉందన్నారు. ఎక్కడైనా నీటి ఎద్దడి తలెత్తితే వెంటనే యుద్ధ ప్రతిపాదికన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట చేతి పంపులు, బోరు మోటర్లు, పైపులైన్ల మరమ్మతులు సకాలంలో చేపట్టాలన్నారు. అవసరం ఉన్న దగ్గర ట్యాంకర్లను వినియోగించాలని, మున్సిపల్, పంచాయతీల పరిధిలో నీటి ఎద్దడి నివారణకు టోల్ ఫ్రీ నెంబర్లు ప్రతి ఒక్కరికి తెలిసేలా ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సరఫరాపై తీసుకుంటున్న చర్యలపై అధికారి విజయేంద్ర దృష్టికి తీసుకువచ్చారు.

**జిల్లాలో నీటి కొరత లేదు: కలెక్టర్ గౌతమ్**

జిల్లాలో ఇప్పటి వరకు నీటి కొరత లేదని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. జిల్లాలో నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందుగానే ప్రణాళికను రూపొందించుకోవాలని అధికారులకు సూచించామన్నారు. తాగునీటి ఎద్దడి పరిష్కారానికి జిల్లాలోని పంచాయతీ కార్యాలయాల్లో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అధికారులు సమన్వయంతో ఉండి నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగ్యస్త, సీఈవో దిలీప్ కుమార్, డీపీఓ వెంకటయ్య, డీఆర్డీఏ పీడీ సాంబశివరావు పాల్గొన్నారు.

## పేదవాడికి మెరుగైన వైద్యమే.. ప్రభుత్వ లక్ష్యం

**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా**




*కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా*

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 6: తెలంగాణ రాష్ట్రంలో వైద్య శాఖను ప్రక్షాళన చేపట్టి ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ అన్నారు. ఈ మేరకు శనివారం ఉస్మానియా మెడికల్ కళాశాల అలూమ్ని అసోసియేషన్, ట్రస్ట్ ఆధ్వర్యంలో వరల్డ్ హెల్త్ డేను పురస్కరించుకొని స్పెషాలిటీ వైద్య విద్యార్థులకు గోల్డ్ మెడల్ ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం యూజీ, పీజీ, స్పెషాలిటీలకు చెందిన 37 మంది వైద్య విద్యార్థులకు బంగారు పతకాలను అందజేసి సత్కరించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ ఉస్మానియా అంటేనే ఒక బ్రాండ్ అని అన్నారు. ఆ బ్రాండ్ ప్రస్తుతం, తగ్గుముఖం పట్టిందని, తిరిగి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే కోర్టు తీర్పు అనుకూలంగా వస్తుందని, తీర్పు వచ్చిన వెంటనే ఉస్మానియా దవాఖానకు నూతన అత్యాధునిక భవనాన్ని నిర్మించేందుకు శంకుస్థాపన చేపడుతామన్నారు. ఈ యేడాది వరల్డ్ హెల్త్ డే సందర్భంగా 'నా ఆరోగ్యం, నా హక్కు' అనే నినాదాన్ని మరింత ముమ్మరంగా విస్తరింపజేయాలన్నారు. వచ్చే జూన్‌లో బడ్జెట్‌లో లెక్చ ర్ హాల్స్, హాస్టల్‌లకు భవనాలను నిర్మించేందుకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మెడికల్ సెల్ చైర్మన్ డాక్టర్ సుధాకర్ యాదవ్, డీఎంఈ శ్రీవాణి, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర కుమార్, అకాడమిక్ డీఎంఈ శివరామప్రసాద్, ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్, అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి భూ పాల, నిలోఫర్ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, ఎంఎన్‌జే దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసులు, అలూమ్ని అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కృష్ణారెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ బీఎస్ శ్రీధర్, కార్యదర్శి డాక్టర్ కృష్ణమూర్తి, ఉస్మానియా హెచ్‌వోడీలు డాక్టర్ మనీషా సహాయ్, డాక్టర్ ఇమాముద్దీన్‌తో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



**చార్మినార్.. షాపింగ్ కళ**

రంజాన్ మాసం సందర్భంగా పాతబస్తీలోని చార్మినార్, మదీనా ప్రాంతం సందర్శకులు, వినియోగదారులతో కిటకిటలాడుతున్న దృశ్యం



*ఆలిండియా ఓపెన్ టెన్నిస్ టోర్నీ ప్రారంభోత్సవంలో హీరో నాగశౌర్య, ప్రముఖ క్రీడాకారులు సాకేత్ మైనేని తదితరులు*

## ఎఫ్ఎన్‌సీసీ ఆలిండియా ఓపెన్ టెన్నిస్ టోర్నీ షురూ

బంజారాహిల్స్, ఏప్రిల్ 6: ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్(ఏఐటీఏ), తెలంగాణ స్టేట్ టెన్నిస్ అసోసియేషన్ (టీఎస్‌టీఏ) సహకారంతో నిర్వహిస్తున్న ఎఫ్ఎన్‌సీసీ ఆలిండియా ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌ను శనివారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో హీరో నాగశౌర్య, అర్జున అవార్డు గ్రహీత సాకేత్ మైనేనీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఏప్రిల్ 6వ తేదీ నుంచి 12 వరకు పురుషుల విభాగం పోటీలు జరుగుతాయని, 13 నుంచి 19 వరకు మహిళల విభాగం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎఫ్ఎన్‌సీసీ కార్యదర్శి ముళ్లపూడి మోహన్ తెలిపారు. వర్ధమాన క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం ఇచ్చేందుకు తొలిసారి ప్రతిష్ఠాత్మక టెన్నిస్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడు ఆదిశేషగిరి రావు పేర్కొన్నారు. కార్యకర్మంలో స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ చాముండేశ్వరీనాథ్, ఉపాధ్యక్షుడు రంగారావు, పెద్దిరాజు, ఖాజా సూర్యనారాయణ, ఏడిద రాజా, టీఎస్‌టీఏ అధ్యక్షుడు కేఆర్ రామన్, కార్యదర్శి నారాయణ దాస్ పాల్గొన్నారు.



*5కే రన్ ప్రారంభోత్సవంలో ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ వెంకటేశ్వర్ రావు, రాక్టెర్ విజయ్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ రావు, ప్రిన్సిపాల్ వెంకటనర్సింహారెడ్డి తదితరులు*

## యోగా, వ్యాయామంతో ఆరోగ్యవంతులు కండి

**ఏసీపీ శ్రీనివాసరావు**

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 6: ఆరోగ్యమే మహాభాగ్యమని, విద్యార్థులు నిత్య వ్యాయామం యోగా సాధనతో ఆరోగ్యవంతులుగా జీవించాలని కూకట్‌పల్లి ఏసీపీ కె.శ్రీనివాసరావు అన్నారు. జేఎన్టీయూహెచ్ వర్సిటీ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 5కే రన్‌ను ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ ఎం.వెంకటేశ్వర్ రావు, రెక్టార్ కె.విజయ్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ డి.వెంకట నర్సింహా రెడ్డి, డిపార్ట్‌మెంట్ విభాగ అధిపతి రామ్‌జీ, కోఆర్డినేటర్ భ్రమరలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యూనివర్సిటీలో ప్రతియేటా నిర్వహించే సాంకేతిక విద్యా ప్రదర్శన (టెక్ ఫెస్ట్)లో భాగంగా మెకానికల్ విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించడం, దాని ప్రమోషన్‌లో భాగంగా 5కే రన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు, అధ్యాపకులు ఉన్నారు.

## మే 22 నుంచి పాన్ ఇండియా అథ్లెటిక్స్ టోర్నీ




హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ వేదికగా పాన్ ఇండియా జాతీయ మాస్టర్ గేమ్స్ మే 22 నుంచి 24వ తేదీ వరకు జరుగనున్నాయి. దీనికి సంబంధించి ఎల్బీ స్టేడియం ఒలింపిక్ భవన్‌లో తొలి పాన్ ఇండియా ఫెడరేషన్ కప్ నేషనల్ మాస్టర్స్ భేటీ శనివారం జరిగింది. ఇందులో రాష్ట్ర మాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా హాజరయ్యారు. టోర్నీకి సంబంధించిన బ్రోచర్‌ను పాన్ ఇండియా జనరల్ సెక్రెటరీ నటరాజ్, కోశాధికారి హేమప్రభ, రామారావు, జగదీశ్వర్ యాదవ్ ఆవిష్కరించారు.